నిరుద్యోగుల నేస్తం నగర గ్రంథాలయం

పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ● రోజూ 15 గంటల పాటు లైబ్రరీలోనే చదువులు

చిక్కడపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోనే ప్రసిద్ధి గాంచిన చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయం ఆవరణలోని లైబ్రరీ ఓపెన్ ఆడిటోరియం పోటీ పరీక్షల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులకు అండగా ఉంటోంది. చిక్కడపల్లిలోని హైదరాబాద్ నగర గ్రంథాలయ ఓపెన్ ఆడిటోరియం ప్రాంగణంలో ప్రతీరోజు వేల సంఖ్యలో నిరుద్యోగులు, విద్యార్థులు పోటీపరీక్షలకు సిద్ధమవుతుంటారు. ఉదయం 8 గంటల నుంచి మొదలుపెడితే రాత్రి 11 గంటల వరకు ఆడిటోరియం లోపల, బయట, చెట్ల కింద కూర్చుని వేల మంది పోటీపరీక్షల అభ్యర్థులు ఉద్యోగ అర్హత పరీక్షలకు సిద్ధమవుతున్నారు. తెలంగాణతో పాటు ఆంధ్ర ప్రాంతానికి చెందిన అనేకమంది పోటీపరీక్షల అభ్యర్థులు ఓపెన్ ఆడిటోరియంతో పాటు చుట్టుప్రక్కల కుర్చీలు తెచ్చుకుని అక్కడే తిష్ఠ వేస్తున్నారు. గడిచిన పన్నెండు సంవత్సరాలుగా లైబ్రరీలో ఈ విధంగా అభ్యర్థులు ప్రిపేర్ అవుతున్నారు. లైబ్రరీ పక్కనే హుస్సేన్‌సాగర్ నాలాను ఆనుకుని ప్రయివేట్ బిల్డర్లు అపార్ట్‌మెంట్‌లు కట్టారు. దీంతో అపార్ట్‌మెంట్‌కు రక్షణగా లైబ్రరీ స్థలం వెంట ప్రహరీని నిర్మించారు. దీనివల్ల లైబ్రరీ ఓపెన్ ఆడిటోరియం అంతా శుభ్రంగా కనిపిస్తోంది. పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న



లైబ్రరీ ఓపెన్ ఆడిటోరియం

అభ్యర్థులు ఎవరికి వారు తమతమ కుర్చీలు తెచ్చుకుని రాత్రి వరకు ప్రిపేర్ కావడం కనిపిస్తుంది.

2001 అమెరికాకు చెందిన భాష్యం శ్రీనివాసరావు ఈ ఓపెన్ ఆడిటోరియం నిర్మాణానికి సహకరించారు. అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ ఆడిటోరియాన్ని ప్రారంభించారు. అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా ఆడిటోరియం పరిసరాలను శుభ్రం చేసేందుకు జీహెచ్ఎంసీ సిబ్బంది అయిదుగురిని నియమించింది. వీరు లైబ్రరీ ప్రాంగణం మొత్తం శుభ్రం చేస్తుంటారు.

అభ్యర్థుల కోసం సౌకర్యాలు



పన్నెండు సంవత్సరాలుగా లైబ్రరీ ఓపెన్ ఆడిటోరియం ఆవరణలో పోటీపరీక్షలకోసం ప్రిపేర్ అవుతున్న అభ్యర్థుల సౌకర్యార్థం అనేక సదుపాయాలు కల్పించాం. లైబ్రరీకి ప్రహరీని నిర్మించాం. ఆ ప్రాంగణం అంతా శుభ్రం చేయిస్తున్నాం. ఓపెన్ ఆడిటోరియంలో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు ఏర్పాటు చేశాం. హరేరామ హరేకృష్ణ మూవ్‌మెంట్, జీహెచ్ఎంసీ వారితో మాట్లాడి మధ్యాహ్నం భోజన సదుపాయం ఏర్పాటు చేయించాము. మంచినీటి వసతి కూడా ఉంది. ఇంతే కాకుండా లైబ్రరీ లోపలి భాగంలో కూడా వీరి కోసం ప్రత్యేక గదులు అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేశాం.

\- పొట్లూరు పద్మజ, లైబ్రరీ కార్యదర్శి

లైబ్రరీ అంటే అభ్యర్థుల్లో ధైర్యం



చిక్కడపల్లిలోని లైబ్రరీ ఓపెన్‌ఆడిటోరియం, లైబ్రరీ ప్రాంగణంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వందలాది మంది పోటీపరీక్షల అభ్యర్థులు ప్రతినిత్యం కలిసి చదువుకోవడం వల్ల వారిలో మానసికస్థైర్యం పెరుగుతుంది. ఉద్యోగం సాధనకు ఎలా చదవాలి, ఉద్యోగం వస్తే ఎలా ఉంటుంది. సమస్యలు ఎలా ఎదుర్కోవాలనే సమస్యలను అందరూ కలిసి చర్చించుకుంటారు. ఇది సమాజానికి మేలు చేస్తుంది. కలిసి చదువుకుంటూ పోటీపరీక్షలకు సిద్ధం కావడంవల్ల జీవితం పట్ల ఒక అభిప్రాయం ఏర్పడడంతో పాటు జీవితంలో సమస్యలు వస్తే ఎలా ఎదుర్కోవాలి వంటి విషయాలు వారికి బోధపడే అవకాశం ఉంది.

\- డా.హిప్నో పద్మాకమలాకర్, ప్రముఖ సైకాలజిస్ట్

లైబ్రరీ ఆవరణలో చదువుకోవడం ఇష్టం



లైబ్రరీ పరిసరాలు చదువుకోవడానికి అనువుగా ఉంటాయి. ఎందరో పోటీపరీక్షల అభ్యర్థులు సంవత్సరాలుగా ఇక్కడ చదువుకుంటూ పోటీపరీక్షలు రాస్తున్నారు. కొందరు జాబ్‌లు సైతం సాధించారు. నేను ఎన్నో ఏళ్లుగా ప్రతినిత్యం ఇక్కడే కూర్చుని పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాను. లైబ్రరీ యాజమాన్యం అన్ని సదుపాయాలు సమకూర్చేందుకు సహకరిస్తోంది. సిటీ సెంట్రల్‌లైబ్రరీ ఆవరణలో పోటీపరీక్షలకు చదువుకోవడం అంటే ఎంతో ఇష్టం. ఇక్కడ అందరూ పోటీపరీక్షల అభ్యర్థులు చదువుకుంటుండడంవల్ల పలు విషయాలు తెలుస్తుంటాయి. లైబ్రరీలో చదువుకోవడానికి అనేక పుస్తకాలు ఉన్నాయి. దీంతో పుస్తకాల కొరత కూడా ఉండదు.

\- మిద్దె సురేష్, పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థి



మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న యెలికట్టి విజయ్‌కుమార్‌గౌడ్ తదితరులు

గౌడ వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి

● గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడ్

రాంనగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2 లక్షల 25 వేల మంది గౌడ వృత్తిదారులు కల్లు గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని, ఈ వృత్తిలో నిత్యం ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు కాటమయ్య రక్షణ కవచం (సేఫ్టీ కిట్స్) పంపిణీ చేయాలని, వృత్తిలో మరణించిన, అంగవైకల్యం పొందిన కుటుంబాలకు సంబంధించి ఇప్పటికే 8 కోట్ల రూపాయల ఎక్స్‌గ్రేషియా పెండింగ్‌లో ఉందని గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు యెలికట్టి విజయ్ కుమార్‌గౌడ్ అన్నారు. వాటిని వెంటనే విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన నేతృత్వంలోని సమితి ప్రతినిధి బృందం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుని కలిసి వినతిపత్రం సమర్పించారు. నూతన గ్రామ పంచాయతీలలో గౌడ సొసైటీలు ఇవ్వాలన్నారు. ఇందుకు స్పందించిన మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి పెండింగ్ ఎక్స్‌గ్రేషియ విడుదల చేయడానికి కృషి చేస్తామన్నారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు దుర్గాగౌడ్, మూల వెంకటేశ్వర్లుగౌడ్, ఆంజనేయులుగౌడ్, బిక్కి బుచ్చయ్యగౌడ్, చిత్తలూరు నారాయణగౌడ్, పూదరి రాజుగౌడ్, దేవేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ జిల్లాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



ముషీరాబాద్ చౌరస్తాలో దిమ్మెను నిర్మించి బొమ్మ ఏర్పాటుకు సిద్ధం చేస్తున్న అధికారులు

ఆకట్టుకునే విధంగా ఆకృతుల ఏర్పాటు

రూ. 1.20 కోట్లతో నాలుగు చోట్ల వివిధ రూపాల ఆకృతులు

ముషీరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నగరాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో భాగంగా ముషీరాబాద్ నియోజకవర్గంలో నాలుగు చోట్ల ప్రజలను ఆకట్టుకునే విధంగా వివిధ రూపాల ఆకృతులను ఏర్పాటు చేసేందుకు జీహెచ్ఎంసీ పనులు చేపట్టింది. నియోజకవర్గంలోని నాలుగు ప్రధాన కూడళ్లలో ఆకృతులను(బొమ్మలు) ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే దిమ్మెలను నిర్మించారు. రూ. కోటి 20 లక్షలతో నియోజకవర్గంలోని ముషీరాబాద్ చౌరస్తా, వీఎస్‌టీ చౌరస్తా, అశోక్‌నగర్ చౌరస్తా, లోయర్ ట్యాంక్‌బండ్ వద్దగల గోశాల వద్ద వివిధ రూపాల ఆకృతులను ఏర్పాటుకు సర్వం సిద్ధం చేశారు. మరో 40 రోజుల్లో నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలను ఆకర్షించే విధంగా తీర్చిదిద్దనున్నారు. జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు నిర్మాణ పనులను పరిశీలిస్తూ ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఆకృతుల వివరాలను వెల్లడించకుండా గోప్యంగా ఉంచుతున్నారు. ప్రధాన కూడళ్లలో ఇప్పటికే ఈ పనులు కొనసాగుతుండడంతో ప్రజలు వాటిపై చర్చించుకుంటున్నారు. ఈ నిర్మాణ పనులు పూర్తి అయితే ముషీరాబాద్ నియోజకవర్గంలోని ప్రధాన కూడళ్లు అందరిని ఆకట్టుకునే విధంగా విరజిల్లనున్నాయి.



జలమండలి జీఎం రామకృష్ణకు సమస్యలు వివరిస్తున్న మాజీ కార్పొరేటర్ వాజిద్ హుస్సేన్

డ్రైనేజీ, మంచినీటి సమస్యలు పరిష్కరించాలి

● మాజీ కార్పొరేటర్ వాజిద్ హుస్సేన్

ముషీరాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్‌లో నెలకొన్న డ్రైనేజీ, మంచినీటి సమస్యలను పరిష్కరించాలని డివిజన్ మాజీ కార్పొరేటర్ వాజిద్ హుస్సేన్ జలమండలి అధికారులను కోరారు. సోమవారం జలమండలి జీఎం రామకృష్ణ డీజీఎం కార్తీక్‌రెడ్డి, సెక్షన్ మేనేజర్ కృష్ణమోహన్‌లను కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. భోలక్‌పూర్ బడీ మసీద్ వద్ద పాడైన బోరింగ్‌కు మరమ్మతులు చేపట్టాలని కోరారు. తాజీర్‌నగర్‌లో అధ్వానంగా మారిన డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు. కలుషిత నీటి సరఫరాను అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన జీఎం సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో భోలక్‌పూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మహ్మద్ ఖరీం ఉద్దీన్, నియాజ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలి

● నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్

నల్లకుంట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్‌లోని శంకర మఠం కూరగాయల మార్కెట్ రోడ్డులో నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో రాకపోకలు సాగించడంలో ట్రాఫిక్ సమస్య నెలకొందని, దీనిని వెంటనే పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్ నేతలు వినతిపత్రం సమర్పించారు. సోమవారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఈ సమస్యపై విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్లకుంటలోని శంకరమఠం కూరగాయల మార్కెట్ రోడ్డు గతంలో దాదాపుగా 50 నుంచి 60 ఫీట్ల వెడల్పుతో ఉందని, నేడు 25 నుంచి 30 ఫీట్లకు తగ్గిపోయిందన్నారు. కూరగాయల నిర్వాహకులు తోపుడు బండ్లను పూర్తిగా రోడ్డు మీదకు తీసుకువచ్చారని ఆరోపించారు. స్పందించిన జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ఈ సమస్య పరిష్కారం కోసం డీఎంసీ ఇతర అధికారులకు సూచిస్తామని హామీ ఇచ్చినట్లు వారన్నారు.



అంబర్‌పేట డివిజన్‌లో కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ సోమవారం నరేంద్రనగర్‌లో పాదయాత్ర చేసి స్థానిక ప్రజలెదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నూతన కమ్యూనిటీ హాల్‌లో బోరు, త్వరలో సీసీ రోడ్డు, వీధి దీపాల వంటి సమస్యలను పరిష్కరిస్తామని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, బస్తీవాసులు పాల్గొన్నారు.

\-అంబర్‌పేట, ఆంధ్రజ్యోతి

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి

● ఎంపీ ఆర్.కృష్ణయ్య

బర్కత్‌పుర, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్ 42 శాతం పెంచిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని, లేకపోతే రాష్ట్రం రణరంగంగా మారుతుందని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. బీసీ వ్యతిరేక చర్యలను ఇప్పటికైనా మానుకోవాలని స్పష్టం చేశారు. రిజర్వేషన్ల పెంపుపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడ అభినందన గ్రాండ్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన శ్రీరామ్ జ్ఞానేశ్వర్‌కు ఆయన నియామక పత్రం అందజేసి మాట్లాడారు. కుల గణన పూర్తయినప్పటికీ రిజర్వేషన్లు పెంచడానికి ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీలో ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.

సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీలలో బీసీలకు 20 శాతం మాత్రమే రిజర్వేషన్లు ఉన్నాయని, వాటిని 42 శాతం పెంచితేనే బీసీలు రాజకీయంగా అభివృద్ధి సాధిస్తారని అన్నారు. విద్య, ఉద్యోగ రంగాలలో కూడా బీసీ రిజర్వేషన్లను 50 శాతానికి పెంచాలని, బీసీలలోని అన్ని కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఒక్కొక్క దానికి వెయ్యి కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

సమావేశంలో బీసీ సంఘాల నేతలు నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, జిల్లపల్లి అంజి, నంద గోపాల్, మట్ట జయంతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీరమణ చౌరస్తాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ వి.హనుమంతరావు

అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులు ప్రారంభం

రాంనగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అంబర్‌పేటలోని శ్రీరమణ చౌరస్తాలో డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులకు వీహెచ్ భూమిపూజ చేసి ప్రారంభించి మాట్లాడారు. నగరంలోని పంజాగుట్టలో పెట్టాల్సిన డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ విగ్రహం శ్రీరమణ చౌరస్తాలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. పంజాగుట్టలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు కేసీఆర్ ప్రభుత్వం అనుమతించకుండా అడ్డుకుందని ఆరోపించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్, నాయకులు రామ్మోహన్, రావుల సుధాకర్, రాజేశ్వర్‌రావు, ప్రభాకర్, కోటం అనిల్‌కుమార్, బాల్‌రాజ్, నరేందర్, శ్రీహరి, ప్రదీప్, శ్రావణ్‌కుమార్, రాకేష్, మన్మోహన్‌మనీష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రబాబు

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

● రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రబాబు

రాంనగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రిటైర్డ్ అయిన వారికి పదవీ విరమణ సమయంలో రావాల్సిన డబ్బులు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. తాము ఇంత కాలం దాచుకున్న జీపీఎఫ్ డబ్బులు కూడా ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. దీంతో ఎంతో మంది పెన్షనర్లు ఇక్కట్లకు గురవుతున్నారని వాపోయారు. సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని పెన్షనర్ల డిమాండ్లను పరిష్కరించాలని ఆయన కోరారు. ప్రభుత్వ హెల్త్‌కార్డులపై నగదు రహిత వైద్యం కార్పొరేట్ ఆస్పత్రుల్లో కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.నరసింగ్‌రావు, కోశాధికారి బి.నర్సయ్య పాల్గొన్నారు.

గంజాయి స్మగ్లర్‌గా సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

● వారం వారం నగరానికి వచ్చి విక్రయాలు

● ఆటకట్టించిన ఎక్సైజ్ పోలీసులు

● రూ. 1.91 లక్షల విలువైన సరుకు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి వారం వారం నగరానికి వచ్చి.. కస్టమర్స్‌కు గంజాయి, ఓజీ కుష్ (మేలు రకం గంజాయి)ని కస్టమర్స్‌కు సరఫరా చేసి వెళ్తున్న సాఫ్ట్‌వేర్ గంజాయి స్మగ్లర్‌ను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. అతడి వద్ద రూ. 1.91 లక్షల ఒక కేజీ పొడి గంజాయి, 175 గ్రాముల ఓజీ గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. తూర్పుగోదావరికి చెందిన శివరామ్ బెంగళూరులోని డెలాయిట్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. గంజాయికి అలవాటుపడిన శివరామ్, బెంగళూరులో అజయ్ అనే గంజాయి స్మగ్లర్ వద్ద పొడి గంజాయి, ఓజీ గంజాయి కొనుగోలు చేసి బస్సులో బయల్దేరి నగరానికి వస్తాడు. ఇక్కడున్న కస్టమర్స్‌కు గుట్టుగా సరుకును అందజేసి, డబ్బులు వసూలు చేసుకొని తిరిగి బెంగళూరు వెళ్తాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న శంషాబాద్‌కు ఎక్సైజ్ పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. దాంతో శివరామ్ బెంగళూరు నుంచి వచ్చి రాయదుర్గం, గచ్చిబౌలి ప్రాంతాల్లో సరుకును విక్రయిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారించగా.. బెంగళూరులో ఓజీ గంజాయిని ఒక గ్రాముకు రూ.1500కు కొనుగోలు చేసి, నగరంలో 3 వేల రూపాయలకు విక్రయిస్తున్నట్లు తేలింది. అనంతరం పోలీసులు నిందితుడ్ని అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు.



పోలీసుల అదుపులో పట్టుబడ్డ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శివరామ్

మాయమైపోతున్న అనుబంధాలు

చిక్కడపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అనుబంధాలు మాయమైపోతున్నాయని ఎమ్మెల్సీ సిరకొండ మధుసూదనాచారి అన్నారు. నేటి సమాజంలో ఆప్యాయతలు కనుమరుగవుతున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో మరణించిన కుమారుని పేరిట ప్రతి ఏటా అతని జయంతి రోజున జర్నలిస్టులకు ప్రతిభాపురస్కారం, విద్యార్థులకు, సామాజిక సేవా సంస్థలకు ఆర్థిక సాయం అందించడం విశేషమని పేర్కొన్నారు. కళానిలయం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి త్యాగరాయగానసభలో ఫణిభార్గవ్ యాదిలో పేరిట జయంతి వేడుకలు జర్నలిస్టులు నవీన్, రాధిక, జ్యోతిలకు నగదు ప్రతిభాపురస్కారం, విద్యార్థి క్రాంతి, అమృతవర్షిణి సేవాసంస్థకు ఆర్థిక పురస్కారం మధుసూదనాచారితోపాటు మరో అతిథిగా పాల్గొన్న సీనియర్ సంపాదకుడు కె. రామచంద్రమూర్తి అందజేశారు. సుందరయ్య విజ్ఞానకేంద్రం మేనేజింగ్ కార్యదర్శి వినయ్ కుమార్‌కు ఆత్మీయసత్కారం చేశారు. రామచంద్రమూర్తి మాట్లాడుతూ సమాజంలో అన్ని రంగాలు పతనస్థాయిలో ఉన్నా ఇంకా న్యాయవ్యవస్థ, పత్రికారంగంలో విలువలు ఉండడంవల్లే సమాజం సజావుగా నడుస్తోందన్నారు. తల్లిదండ్రులు పోతే కొద్దికాలానికి మరిచిపోతున్న రోజుల్లో కొడుకు స్మృతిలో పదేళ్లపైగా ఫణిభార్గవ్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించడం అరుదు అన్నారు. వినయ్‌కుమార్ మాట్లాడుతూ జర్నలిజం పతనానికి కారణం యాజమాన్యాల వైఖరే అన్నారు. సుందరయ్య విజ్ఞానకేంద్రంలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. పుచ్చలపల్లి సుందరయ్య సాహిత్యానికి, కళలకు ప్రజాచైతన్యం మీడియాగా భావించారని అందుకే సుందరయ్య కేంద్రంలో సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు.

గానసభ అధ్యక్షుడు జనార్దనమూర్తి, జర్నలిస్టు దేవదాసు తదితరులు పాల్గొన్నారు.



పురస్కారగ్రహీతలతో అతిథులు



కవి సిద్ధార్థను సత్కరిస్తున్న కె.శ్రీనివాస్, మామిడి హరికృష్ణ తదితరులు

కవి సిద్ధార్థ కవిత్వం తెలంగాణ అస్థిత్వాన్ని ప్రతిబింబిస్తుంది

రవీంద్రభారతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి సిద్ధార్థ కవిత్వం తెలంగాణ అస్థిత్వాన్ని ప్రతిబింబిస్తుందని సీనియర్ జర్నలిస్ట్ కె.శ్రీనివాస్ అన్నారు. సోమవారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జమిలి సాహిత్య సాంస్కృతిక, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కవి సిద్ధార్థ సాహిత్య సమాలోచన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కవి సిద్ధార్థ ప్రతి కవితలో తాత్విక ధోరణితో నింపుతూనే అవసరాన్ని బట్టి ధిక్కార స్వరాన్ని వినిపిస్తాడని అన్నారు. తన చుట్టూ ఉన్న మనుషులు, వారితో ఉన్న అనుబంధాలను అక్షరూపంలో పెడతాడని కొనియాడారు. సిద్ధార్థ పదాల్లో నేలతనం ఉట్టిపడుతుందని పేర్కొన్నారు. సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ మాట్లాడుతూ ప్రపంచీకరణ తొలిదశ నుంచి నేటి వరకు తెలంగాణలో వచ్చిన, వస్తున్న మార్పులను, అస్థిత్వవాదాలను తన కవిత్వంలో చూపిండచం గొప్ప విషయమన్నారు. ఆయన కవిత్వానికి లక్ష్మణ్ ఏలే బొమ్మలు మరింత వన్నె తెచ్చాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, సీనియర్ జర్నలిస్టు బుచ్చన్న, యువకవి ఆదిత్య, అంబటి సురేంద్ర, అక్షరకుమార్ తదితరులు పాల్గొన్నారు. చివరగా స్పందిస్తూ కవి సిద్ధార్థ మాట్లాడుతూ తన కవిత్వం గురించి గొప్పసభ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. కవిత్వం నా కులవృత్తి నేను రాయడం మానను అంటూ ఉపన్యసించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీ-1 పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ వినోద్‌కుమార్ తెలిపారు. అంబేద్కర్‌నగర్, జగదాంబ నర్సింగ్‌హోమ్ 11 కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని ఇందిరాపార్కు, అశోక్‌నగర్, ఆర్‌సీ రెడ్డి, బీమా మైదాన్, గాంధీనగర్, జవహర్‌నగర్, హెరిటేజ్ సూపర్ మార్కెట్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1, కవాడిగూడ పరిధిలోని మారియట్ హోటల్, కొత్తబజార్, హనుమాన్‌టెంపుల్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.



గోల్నాక తులసీనగర్ కాలనీలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా పనిచేస్తా

● ఎమ్మెల్యే కాలేరు

గోల్నాక, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అందించే సంక్షేమ పథకాలు అంబర్‌పేట నియోజకవర్గంలోని ప్రజలకు అందేలా ప్రజాప్రతినిధిగా తాను బాధ్యతతో పనిచేస్తున్నానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. సోమవారం గోల్నాక తులసీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 26 మందికి మంజూరైన ఆర్థిక సహాయం రూ.8 లక్షల 95 వేలు విలువైన చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి వాటి ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను, 420 హామీలను అమలు చేసి ప్రజలకు ఇచ్చిన మాటను నిలుపుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల సంక్షేమం కోసం ఇచ్చిన మాటను నిలుపుకోకపోతే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు వై.బుచ్చిరెడ్డి, ఎన్.లింగంయాదవ్, బాలరాజు, రుద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.



పోతరాజు విశ్వమహరాజ్‌కు నియామక పత్రం అందజేస్తున్న పిడమర్తి రవి

మాదిగ జేఏసీ అధ్యక్షుడిగా పోతరాజు విశ్వమహరాజ్

రాంనగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మాదిగ జేఏసీ సికింద్రాబాద్ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడుగా ముషీరాబాద్ నియోజకవర్గంలోని బాగ్‌లింగంపల్లికి చెందిన మాదిగ జేఏసీ నాయకుడు పోతరాజు విశ్వమహరాజ్ నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, జేఏసీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నక్క మహేష్‌లు ఆయన పేరును ప్రకటించి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విశ్వమహరాజ్ మాట్లాడుతూ మాదిగల డిమాండ్ల పరిష్కారం కోసం తనవంతు పోరాటం చేస్తానన్నారు. జేఏసీ అధినేతలు తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానన్నారు. తనకు పదవి కల్పించిన పిడమర్తి రవి, మహేష్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.